
# జర్నలిస్ట్ కథలు



# పరాంకుశం

## జొన్నలగడ్డ రాధాకృష్ణ

పరాంకుశం అని ఒహడున్నాడు.

వీడుఏ పేపర్లో పనిచేస్తాడో ఎవడికీ తెలియదు. అన్ని ప్రెస్ కాన్ఫరెన్స్‌లకీ తప్పనిసరిగా హాజరవుతాడు. గడ్డం అదీ చూడ్డానికి మేధావిలా వుంటాడు.

ఓసారి ఓ ప్రెస్ కాన్ఫరెన్స్‌కి వచ్చి భీభత్సంగా తాగేస్తుంటే ఆ పార్టీ ఇచ్చినాయన ముచ్చటపడిపోయి తమరు ఏ పేపర్లో పనిచేస్తున్నారు అని అడిగాడు.

వీడు తడుముకోకుండా టైమ్స్ఆఫ్ ఇండియా అని చెప్పేశాడు.

అది విని పక్కనే వున్న టైమ్స్ ఆఫ్ ఇండియా రిపోర్టరు దిగ్భ్రాంతి చెందాడు. వీడు టైమ్స్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తుంటే మరి తను దేంట్లో పనిచేస్తున్నట్టు అని అనుమానం వచ్చింది. చుట్టుపక్కల వాళ్ళందర్నీ అడిగితే పరాంకుశంగాడు అందులో చెయ్యట్లేదని తనే చేస్తున్నాడనీ నిర్ధారించారు.

అందరూ గట్టిగా పట్టుకునేసరికి పరాంకుశం కంగారుపడిపోయి, "బాగా ఎక్కువ తాగేసినందువల్ల ఎందులో పనిచేస్తున్నానో గుర్తు రావడం లేదు. బహుశా గార్డియన్‌లో పనిచేస్తున్నానేమో. మా ఆవిడ్ని అడిగితే కరెక్ట్‌గా చెప్తేస్తుంది. నేనొస్తాను జైహింద్" అనేసి వెళ్ళిపోయాడు.

తీరా వాడు వెళ్ళిపోయాక తెలిసింది వాడు టైమ్సాఫ్ ఇండియా రిపోర్టర్ కళ్ళజోడు పెట్టుకుని వెళ్ళిపోయాడని.

ఆయనవి సోడాబుడ్డి అద్దాలు. అవిలేందే ఆయనకసలు కనపడదు. ఆరోజు ఆయన్ని ఆ హోటల్ ఆరో అంతస్తునించి దింపి, ఇల్లు చేర్చడానికి తల్ప్రాణం తోకకి వచ్చింది.

అయితే ఈ పరాంకుశం గాడు సూపర్ డైనమిక్, ఎంతటి వాణ్ణయినా సరే ఇట్టే బుట్టలో వేసేస్తాడు. మునిసిపల్ కౌన్సిలర్‌ని పట్టుకుని నువ్వు ముఖ్యమంత్రి అయితేగానీ ఈ రాష్ట్రం బాగుపడదు అన్నా అంటాడు. కొందర్ని బాబాయ్ అంటాడు. కొందర్ని మావా అంటాడు. ఎవరికి వీడు నిజంగా తమ బంధువేమోనని వాళ్ళకి అనుమానం వచ్చేలా పెనవేసుకుపోతాడు.

ఇవేళ అలా కొత్త ముఖ్యమంత్రి పెట్టిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పరాంకుశం పెనవేసుకుపోయి ఆయనకి ఊపిరి సలపనీయటం లేదు. గతంలో ఆయన ముఖ్యమంత్రి కానప్పుడు కూడా ఇలాగే అతను పెనవేసుకుని వున్నందువల్ల ఆయన ఏమీ అనలేకపోతున్నాడు. అందులో వీడు ప్రశ్నే అడగడమే "తను చైతన్యవంతమైన నాయకత్వంలో ఇప్పటికే (కొత్త ముఖ్యమంత్రి వచ్చి రెండు వారాలయ్యింది) రాష్ట్రం ఎంతో పురోగమించేసింది గదా. ఇంకా పురోగమించడానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు?" అంటూ పొగడ్త ఎక్కువ, ప్రశ్న తక్కువ మేళవించి అడుగుతూ వుండటంతో వీడు పెనవేసుకుపోయినా ముఖ్యమంత్రికి అంత బాధ అనిపించడం లేదు.

ప్రస్తుతం పరాంకుశం ఒక మరాఠీ భాషా పత్రిక్కీ, ఒక కొంకణి భాషా పత్రిక్కీ పనిచేస్తున్నట్టు చెప్పుకుంటున్నాడు.

ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో ఇలా పరాంకుశం ఆహ్లాదకరమైన ప్రశ్నలు అడుగుతూ వుండగా ఓ రిపోర్టర్ టపీమని "మీ గవర్నమెంటు ఎన్నాళ్ళుంటుంది" అనేశాడు.

ముఖ్యమంత్రికి వాణ్ణి ఖైమాకొట్టించి తన ఇంట్లో ఆల్సేషియన్ కుక్కకి వేసేద్దామన్నంత కోపం వచ్చింది. "పెళ్ళికాగానే నువ్వెప్పుడు ముండమోస్తావ్ అన్నట్టుంది ఈ ప్రశ్న. పరాంకుశాన్ని చూడండి ఎంత చక్కగా ప్రశ్నలడుగుతున్నాడో అలా అభివృద్ధి గురించి అడగండి చెపుతా" అన్నాడు తమాయించుకుని.

"మీ బావమర్దికి ఇంజనీరింగ్ కాలేజీ ఇచ్చారు గదా అందులో సీటుకి డొనేషన్ ఎంత తీసుకుంటారు" అన్నాడు మరో రిపోర్టరు.

"అది వాళ్ళ బావమరిది నడగాల్సిన ప్రశ్న" అన్నాడు పరాంకుశం.

అంతేకాకుండా "ఈ ఏడాది వనమహోత్సవంలో ఎక్కడ, ఏవేం మొక్కలు ఎన్నెన్ని వేస్తున్నారో చెపుతారా" అనేశాడు.

పరాంకుశం ఇలా తనని ఆదుకనే సరికి అనుందానందకదంళిత హృదయారవిందుడైపోయాడు ముఖ్యమంత్రి.

బావమర్దికే ఫైవ్‌స్టార్ హోటల్ కూడా శాంక్షన్ వేయించుకున్నందువల్ల ఫర్నిచర్ ప్రాబ్లం లేకుండా అటవీశాఖ తన దగ్గిరే వుంచేసుకున్నాడు ముఖ్యమంత్రి.

పరాంకుశం ప్రశ్న వెయ్యడంలో అంతర్యం గ్రహించి "శ్రీకాకుళంలో 60 లక్షల టేకు చెట్లు, 30 లక్షల వేపచెట్లు, 43 లక్షల చింత చెట్లు" అంటూ జిల్లాల వారీగా వెయ్యబోయే చెట్ల జాబితాని చదువుకుంటూ పోతున్నాడు. పూర్తయ్యేసరికి ఇంకో రెండ్రోజులు పట్టేట్టుంది. ఇంకేదైనా ప్రశ్న అడుగుదామంటే ముఖ్యమంత్రి వినిపించుకోవడం లేదు. వొంచిన తల ఎత్తకుండా చదువుకుంటూ పోతున్నాడు. ఒక్క పరాంకుశమే శ్రద్ధగా రాసుకుంటూ


న్నాడు. మధ్యమధ్యన ఫలానా జిల్లాలో ఎన్నెన్ని వేపచెట్లు అని అడిగి సందేహాలు నివృత్తి చేసుకుంటున్నాడు.

"ఒరేయ్ పరాంకుశం బయటికి రానీ పనిచెపుతా. నువ్వు కొంకిణీ భాష పత్రిక్కి పనిచేస్తున్నావా, పాళీ భాష పత్రిక్కి పనిచేస్తున్నావో తేలుస్తా" అన్నాడు ఓ రిపోర్టరు వొళ్ళుమండి.

పరాంకుశం పట్టించుకునే పరిస్థితుల్లో లేదు తన్మయత్వంతో రాసుకుపోతున్నాడు.

ఇంక తక్కిన రిపోర్టర్లు చేసేదిలేక బయటికి వచ్చేశారు.

అందరూ కలిసి పరాంకుశం మాదు పగలగొట్టాలని, వాణ్ణి వెలివెయ్యాలని డిసైడ్ చేసుకున్నారు.




అయితే వీళ్ళంతా వూహించినట్టు ముఖ్యమంత్రి ఆ జాబితా పూర్తి చేయడానికి రెండ్రోజులు పట్టలేదు. తక్కిన రిపోర్టర్లందరూ వెళ్ళిపోగానే ఆయన చెప్పడం మానేశాడు. పరాంకుశం రాయడం మానేశాడు.

"హమ్మయ్య గండం గడిచింది. ఒక్కనాకొడుక్కి కూడ రాత్రి పుద్దుకి గతుండదు. లక్షల లక్షలు ఖర్చుపెట్టి ముఖ్యమంత్రి అయితే ఎప్పుడు దిగిపోతావ్ అంటారా" అన్నాడు ముఖ్యమంత్రి కసిగా.

పరాంకుశం నమ్రతగా నవ్వాడు. "పోనీలెండి సార్. ఏనుగు నడుస్తుంటే కుక్కలు మొరుగుతాయ్" అన్నాడు.

పరాంకుశం తనని కుక్క అంటున్నాడేమో అని అనుమానం వచ్చింది ముఖ్యమంత్రికి.

వెంటనే పి.ఏ. ఆ విషయం కనిపెట్టేసి, "పరాంకుశం గారు తమని ఏనుగుతోనూ వాళ్ళని కుక్కల్తోనూ పోలుస్తున్నారు" అనేశాడు ప్రకాశంగా. అలా ముఖ్యమంత్రి ఏదైనా అపార్థం చేసుకోబోతున్నప్పుడు ప్రకాశంగా అనైడం అతగాడి హాబీ.

ముఖ్యమంత్రి మరోసారి సంబరపడిపోయాడు.

పరాంకుశం రుణం ఎలా తీర్చుకోవాలో అర్థం కావడం లేదోయ్" అన్నాడు గాద్గదిక స్వరంతో.

"అదేవుంది సార్ అతి సులభం" అంటూ పరాంకుశం జేబులోంచి ఓ కాయితం తీసి ఇచ్చాడు.

"ఏవిటిది" అన్నాడు ముఖ్యమంత్రి కాయితం ఇంగ్లీషులో వుండటం గమనించి గంభీరంగా.

"ఏవుందిసార్, చిన్న రిక్వెస్ట్. బంజారా హిల్స్‌లో ఓ గవర్నమెంట్ స్థలం ఖాళీపెట్టేశారు. అంచేత నేలంతా కుళ్ళిపోతుంది. అది కాస్తా నా పేర్న పెట్టారంటే ఏదో ఓ చిన్న ఫైవ్‌స్టార్ హోటల్ కట్టుకుని మీ పేరు చెప్పుకుని రెండు పూటలా భోంచేస్తా" అన్నాడు పరాంకుశం వినయంగా.

"ఏవిటి భోంజైడానికి హోటల్ పెడతావా? మీ ఆవిడ వంటచెయ్యదా?" అన్నాడు ముఖ్యమంత్రి ఆశ్చర్యంగా.

పి.ఏ. రహస్యంగా తలబాదుకున్నాడు.

"మీ పేరు చెప్పుకుని జీవితాంతం పుద్దుకి లోటు లేకుండా బతుకుతాను అంటున్నారు. సార్ పరాంకుశం గారు" అన్నాడు పి.ఏ. ప్రకాశంగా.

"మరీ ఫైవ్‌స్టార్ ఎందుకోయ్ వో స్టారు చాలదూ" అన్నాడు ముఖ్యమంత్రి. ఐదు స్టార్ల బదులు సింగిల్ స్టారుకి వొప్పుకుంటే వాడడిగిన స్థలంలో కూడా అయిదో వంతు ఇస్తే సరిపోతుందని.

మొత్తం మీద మూడుస్టార్ల మీద బేరం కుదిరింది. ముఖ్యమంత్రి అయితే రెండున్నర స్టార్లే అన్నాడు గానీ అరస్టారుకి సెంట్రల్ గవర్నమెంటు ఒప్పుకోదని నచ్చజెప్పి మూడుస్టార్లకి ఒప్పించేశాడు పరాంకుశం.

దీనికి ప్రతిఫలంగా ప్రెస్సువాళ్ళు ఇకమీదట శాశ్వతంగా ముఖ్యమంత్రి జోలికి రాకుండా చూస్తానని మాట ఇచ్చాడు పరాంకుశం.

ఆ రాత్రి ప్రెస్‌క్లబ్బులో తక్కిన రిపోర్టర్లందరూ పరాంకుశాన్ని కాకుల్లా పొడిచారు. ఎందుకు సకల నాయకులకూ ఇలా చెంచాగిరీ చేస్తున్నావని నిలదీశారు.

పరాంకుశం బీభత్సంగా తాగేసినట్టు నటించి "మీరంతా తెలుగు దేభ్యం పార్టీ వాళ్ల దగ్గిర లంచాలు తీసుకుని ముఖ్యమంత్రులని పూటిపోటి మాటలంటున్నారు" అన్నాడు.

దాంతో అందరూ కలిసి పరాంకుశాన్ని అడ్డమైన తిట్లూ తిట్టారు. పరాంకుశం ప్రెస్‌కాన్ఫరెన్స్‌కి వస్తే తక్కిన వాళ్ళెవరూ వుండరాదు అని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

పరాంకుశం ఆనందానికి అంతులేదు. అప్పట్నించి ముఖ్యమంత్రికి ఎప్పుడైనా విలేకరులు తారసపడితే వెంటనే హెలీకాప్టర్ పంపించి పరాంకుశం ఎక్కడున్నా పిలిపించుకునే వాడు. అతన్ని చూడగానే ఎక్కడ విలేకరులు అక్కడ పారిపోతుంటే ముఖ్యమంత్రి ఆనందం పట్టలేక "పరాంకుశం నీ రుణం ఎలా తీర్చుకోవాలి" అనబోయి నాలిక్కొరికేసుకున్నాడు.

ముఖ్యమంత్రి నాలిక్కొరుక్కున్న కారణంగా పరాంకుశం జేబులో కాయితం జేబులోనే వుండిపోయింది. ●